చివరి తడుపేది..?

- కీలక సమయంలో అందని మడ్డువలస
- నీరు లేక ఎండిపోయిన కాలువలు
- ఆందోళనలో అన్నదాత



నాగులవలస-పెంట గ్రామాల మధ్య మడ్డువలస కాలువ పరిస్థితి



వరి పంట



సాగునీరు కోసం ఇంజిన్ తీసుకెళ్తున్న దృశ్యం

జి.సిగడాం: వేసవిని తలపించే ఎండలతో పాటు ముఖం చాటేసిన వరుణుడు అన్నదాతను ఆందోళనలోకి నెట్టేశాడు. మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం వరి పొట్టదశ నుంచి ఇప్పుడిప్పుడే ధాన్యం కంకులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి సమయంలో చివరి తడుపు చాలా ముఖ్యం. సాగునీరు అందకుంటే పొల్లు గింజలుగా మారి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మరో పక్క మినుము, పెసర, వేరుశనగ, ఇతర పంటలకు సైతం చివరి తడుపు అవసరం. దీంతో సాగునీటి కోసం రైతన్న కాలువల వైపు దీనంగా చూస్తున్నాడు. మండలంలోని వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవళపేటపెంట, సీతంపేట, టీడీవలస, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం గ్రామాలకు ఖరీఫ్ ప్రారంభమై నేటి వరకు కాలువ ద్వారా నీరు రాలేదు. గతంలో కురిసిన వర్షాలకు వరి నాట్లు వేశారు. అనంతరం రైతన్నలు చుక్క నీరు కోసం నానా పాట్లు పడుతున్నారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి చివరకు నీరు లేకపోవడంతో రాత్రి పగలు తేడాలేకుండా రైతులం కష్టపడుతున్నామని వాపోయారు. ప్రధాన కాలువ కింద ఉన్న రైతులకు ఉన్న పంట పొలాలన్నీ పూర్తి బీటలు వాలిపోతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం మండలంలో 5000 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది ఆశలు లేవు

కాలువలు ద్వారా సాగునీరు అందడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలువను నమ్ముకుని సాగుచేస్తే కష్టాలు తప్పడం లేదు. మడ్డువలస సాగునీరు అందించాలని ఉన్నత అధికారులకు వినతులు అందించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది వరిపంటపై ఆశలు లేవు.

– చందనాల రంగారావు, సంతవురిటి

పూర్తిస్థాయిలో నష్టం

ప్రతీ సంవత్సరం పంట పొలాలకు మడ్డువలస సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. 39 ఎల్ వద్ద నీరు పారే థోని నిర్మాణం చేపట్టాలి. కానీ ఎన్ని విన్నతులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం ఏదు. ఈ ఏడాది పంట చేతికి రావడం కష్టమేనని అనిపిస్తోంది.

– మక్క నారాయణరావు, పెంట

క్లుప్తంగా

వెలవెలబోయిన బాణసంచా దుకాణాలు



దుకాణాదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో బాణసంచా అమ్మకాల తాత్కాలిక లైసెన్సులు పొందిన 20 దుకాణాలు బుధవారం వెలవెలబోయాయి. లైసెన్సుల జాప్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని, రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినా ఉపయోగం లేదని వ్యాపారులు ఆందోళన చెందారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా షాపులకు అనుమతులివ్వడం కూడా ఓ కారణంగా చెప్పుకోవచ్చన్నారు. సీఎం చంద్రబాబు రాక సందర్భంగా బందోబస్తు విషయమై ఇచ్ఛాపురానికి ఎస్పీ వెళ్లిపోవడంతో డీఎస్పీ వివేకానంద గ్రౌండ్‌లో స్టాల్స్‌ను, ఇతర ఏర్పాట్లును పర్యవేక్షించారు.

ఇస్కాన్‌కు ఫ్యాన్లు వితరణ



సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్దనున్న ఇస్కాన్ జగన్నాథ స్వామి మందిరానికి మంత్రి రమణ మేస్త్రి రెండు సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా బుధవారం అందించారు.

సీటు కోసం పాట్లు



బస్సులో సీట్లు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు సీట్లు కోసం పాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ఫీట్లు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల తాకిడి అధికంగా ఉంటోంది. దీంతో పాటు ప్రయాణికులు కూడా అధిక సంఖ్యలో ఉండడంతో బస్సులో సీట్లు కోసం ఇటు విద్యార్థులతో పాటు అటు ప్రయాణికులు కూడా ఎగబడుతున్నారు. దీంతో బస్సు ఎక్కేందుకు తోపులాటలు తప్పడం లేదంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

శిలా ఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

శ్రీకాకుళం: నగరంలోని గొంటివీధి ప్రారంభంలో ఉన్న శిలా ఫలకాన్ని కొందరు మందుబాబులు పది రోజుల క్రితం ధ్వంసం చేశారు. 2002 సంవత్సరంలో ఆ ప్రాంతంలోని సీసీ రోడ్డును అప్పటి ఎంపీ ఎర్రన్నాయుడు, శాసన సభ్యుడు గుండ అప్పలసూర్యనారాయణ, మున్సిపాల్ ఛైర్మన్ పైడిశెట్టి జయంతిలతో ప్రారంభించారు. కార్యక్రమానికి సంబంధించిన శిలా ఫలకాన్ని ధ్వంసం చేసినట్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు.

రోడ్డు పునర్నిర్మాణం



రోడ్డు బాగు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం: కలెక్టర్ బంగ్లా సమీపంలో ధ్వంసం చేసిన సీసీ రోడ్డును సంబంధిత వ్యక్తులే పునర్నిర్మించారు. నగరపాలక సంస్థకు చెందిన ఈ రోడ్డును కొందరు ధ్వంసం చేయడంపై బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత వ్యక్తులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ విషయాన్ని మున్సిపాల్ అధికారులు, పోలీసు స్టేషన్‌లోనూ తెలియజేశారు. దీంతోసమస్య సద్దుమణిగింది.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు



ఇళ్లపై వేలాడున్న 11 కేవీ ఎల్‌టీ విద్యుత్ వైర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ ఎస్సీ కాలనీలో ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. దీంతో ఇళ్లల్లో నివాసం ఉంటున్న వ్యక్తులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లగా మార్చేందుకు స్తంభాలు వేశారు. అయితే వైర్ల మార్పు ఇంకా చేయలేదు. ఇళ్లపై ఉన్న వైర్లు మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆర్టీసీని పరిరక్షించుకోవాలి



శ్రీకాకుళం కాంప్లెక్స్ వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులు, సిబ్బందితో పాటు ప్రయాణికులపై ఉందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు, శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మలు అన్నారు. ఆర్టీసీ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్, ఔట్ గేట్ వద్ద ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు వాహనాలు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిలుపుదల చేయకుండా చూశారు. ప్రైవేటు వాహనాలు ఏవైనా ఇక్కడ నిలపకూడదని, రవాణాశాఖ నియమ నిబంధనల మేరకు కాంప్లెక్స్‌కు రెండు కిలోమీటర్లు దూరంలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేయాలన్నారు. అలా కాని పక్షంలో తగు చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ టీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఎ బాషా, ఎస్‌టీఐ ఐఎస్ రావు, ఏడీసీ పీఆర్‌కె రావు, ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ప్రతినిధులు రామకృష్ణారావు, గోవిందరావు, సుబ్రహ్మణ్యం, రామారావు, ఆర్టీసీ పీఆర్‌వో కె.సుమన్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్సు అందజేత



కండక్టర్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కింజరాపు నరేష్ అనే బ్యాంక్ ఉద్యోగి నరసన్నపేట నుంచి పాతపట్నంనకు నిత్యం ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తుంటాడు. అతను ఎప్పటిలాగే మంగళవారం ఉదయం నరసన్నపేట నుంచి పాతపట్నంనకు ప్రయాణం సాగించాడు. తన గమ్యస్థానమైన పాతపట్నం వచ్చేసరికి హడావుడిగా దిగిపోయాడు. అలా దిగే సమయంలో తన పర్సును బస్సులో జారవిడుచుకున్నాడు. పర్సు పడిపోయిన విషయాన్ని గమనించని ప్రయాణికుడు కింజరాపు నరేష్ యథావిధిగా బ్యాంక్‌కు వెళ్లిపోయాడు. అక్కడ తన పర్సు పోయిన విషయాన్ని గమనించి ఎక్కడ పోగొట్టుకున్నాడో గుర్తులేక బాధపడ్డాడు. ఇంతలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులందరూ దిగిపోయిన తర్వాత, ఆ బస్సు కండక్టర్ శ్రీనివాస్ బస్సు మొత్తాన్ని పరిశీలించగా బస్సులో పర్సు ఉన్న విషయాన్ని గమనించి ఆ పర్సును పాతపట్నం కాంప్లెక్స్‌లోని విచారణ కేంద్రం వద్ద ఆర్టీసీ అధికారి మురళికి అందజేశారు. పర్సు కోసం ఎవరైనా వస్తే విచారించి ఆ పర్సును అందజేయాలని కోరారు. మరలా సాయంత్రం అదే బస్సులో బ్యాంక్ ఉద్యోగి కింజరాపు నరేష్ ప్రయాణించగా బస్‌లో కండక్టర్ శ్రీనివాస్‌కు పర్సు దొరికిన విషయాన్ని తెలుసుకుని మురళి వద్దకు వచ్చి విచారించి తగిన ఆధారాలు చూపించి ఆ పర్సు తనదేనని నరేష్ తెలియజేశాడు. పర్సులో విలువైన ఏటీఎం కార్డులు, కొంత మొత్తం నగదు ఉన్నాయి. వాటి వివరాలు నరేష్ తెలియజేశారు. ఆ పర్సు మురళిదేనని గుర్తించి ఆ పర్సును ఆర్టీసీ అధికారి మురళి ప్రయాణికుడు నరేష్‌కు అందజేశారు. దీంతో పోగొట్టుకున్న పర్సు తిరిగి యథాతథంగా తనకు అందజేసిన బస్ కండక్టర్ శ్రీనివాస్ నిజాయితీని గుర్తించి నరేష్ అభినందించారు.

రోడ్డు పక్క ప్లాస్టిక్ వ్యర్థాలు



పాత జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యర్థాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పాత జాతీయ రహదారికి అనుకొని ఎచ్చెర్ల నుంచి చిలకపాలేం వైపు వెళ్లే రోడ్డు పక్కల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నారు. హోటళ్లు, దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలు పడేస్తున్నాను. ఈ వ్యర్థాల తొలగింపునకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మరోపక్క ఎటువంటి డస్ట్‌బిన్లు సైతం ఏర్పాటు చేయడం లేదు. ఈ వ్యర్థాలు వల్ల రోడ్డు పక్కల్లో అపారిశుద్ధ్య వాతావరణ, పర్యావరణ హానికి అవకాశం ఏర్పడుతోంది.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీకాంత్

జి.సిగడాం: గ్రామసభల ద్వారా భూ రీసర్వేలో రైతులకు నెలకున్న భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని, వీటిని రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ కోరారు. మండలంలోని సీతంపేట పంచాయతీ గేదెలపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. రీసర్వే పూర్తైన గ్రామాల్లో రైతుల పడుతున్న ఇబ్బందులపై గ్రామసభ ద్వారా సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చున్నారు. కొన్ని గ్రామాల్లో ఎక్కువగా కోర్టులో కేసులు ఉండడంతో కొన్ని పరిష్కారం సాధ్యం కాదన్నారు. సమస్య వచ్చిన వెంటనే సంబంధిత వీఆర్వో, ఆర్ఐల ద్వారా పూర్తి సమాచారం తెచ్చుకుని పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వన్-బీ రాకపోతే తక్షణమే ఆ గ్రామం వీఆర్వో లేదా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యకమంలో సర్పంచ్ గేదెల మల్లిబాబు, ఎంపీటీసీ గేదెల నారాయణరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి, సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, మొయ్యి ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే దేశ ప్రగతి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐక్యతతోనే దేశ ప్రగతి సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజినీ అన్నారు. వర్సిటీలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి యూనిట్ కప్ ఆవిష్కరణ



క్రికెట్ కప్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ స్థాయిలో జరిగే సత్యసాయి యూనిట్ క్రికెట్ పోటీల కప్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. జిల్లా కేంద్రంలోని పెద్ద మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ యువతలో జాతీయ భావాన్ని, సమైక్యతను పెంపొందించడానికి పోటీలు దోహదపడతాయన్నారు. ఫైనల్ మ్యాచ్ నవంబర్ 3న చిలకపాలెం శివాని కాలేజీలో జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరరావు, పూర్వపు అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నరసింహమూర్తి, యూత్ కో-ఆర్డినేటర్ శివకుమార్, విద్యా విభాగ సమన్వయకర్త శశికాంత్, పెద్దమందిరం కన్వీనర్ మురళీకృష్ణ, అన్నపూర్ణ సేవా సెక్రటరీ ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

'సర్పంచ్‌లకే కేటాయించాలి'



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులను ప్రభుత్వం వెండర్స్‌కు కేటాయించే విధానాన్ని రద్దు చేస్తూ, సర్పంచ్‌లకు విధులు, నిధులు కేటాయించాలని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సాయి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈశ్వరరావుకు సర్పంచ్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లకు కేటాయించని సమక్షంలో న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. అలాగే వచ్చే సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేసేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెద రామినాయుడు, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, సర్పంచ్‌లు బవిరి రమణ, మీసాల రామారావు, గొర్లె అప్పలనాయుడు, కంబపు రామిరెడ్డి, బొమ్మలాట శ్రీరాములు, మాగుపల్లి రాము, అల్లిపల్లి అప్పన్న, మీసాల శ్రీనివాసరావు, మైలపల్లి తాత, ఎంపీటీసీలు పతివాడ సత్యం, పాల రాము తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా భవనం



నిరుపయోగం ఉన్న భవనాలు

జి.సిగడాం: స్థానిక ఎస్సీ హాస్టల్ భవన సముదాయం నిరుపయోగంగా పడి ఉంది. ఇక్కడ విద్యార్థులు లేకపోవడంతో ఆవులు, కుక్కలకు నివాసంగా ఉంది. అధికారులు స్పందించి భవనాల మరమ్మతులు చేపట్టి, కార్యాలయానికి వినియోగించుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో బుధవారం మహానివేదన, శాంతి హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రంగనాథస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మందసకు చెందిన కూర్మనాథాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రహరీ నిర్మించరూ..!



టిడ్కో కాలనీ మధ్యలో ఉన్న పాత్రునివలస శ్మశానవాటిక

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస పరిసర ప్రాంతాల్లో ఉన్న టిడ్కో కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించాలంటూ టిడ్కో కాలనీవాసులు కోరుతున్నారు. పాత్రునివలసలో ఎవరైనా చనిపోతే నేరుగా టిడ్కో కాలనీ వాసులు నివాసం ఉంటున్న ప్రదేశంలో శవాన్ని తగలబెట్టడంతో మరింత భయాందోళన చెందుతున్నట్లు కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అందువలన నగరపాలక సంస్థ అధికారులు టిడ్కో కాలనీపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

జిల్లా కోర్టుకు బోరుగడ్డ



బోరుగడ్డ అనిల్‌ను కోర్టుకు తరలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను జిల్లా న్యాయస్థానానికి గార పోలీసులు తీసుకొచ్చారు. 2023 జులై 10న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లను సోషల్ మీడియా వేదికగా బోరుగడ్డ విమర్శించారు. అప్పట్లో గార మండలం శ్రీకూర్మం మాజీ ఎంపీటీసీ గోర సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోరుగడ్డకు పీటీ వారెంటు మంజూరు కావడంతో శ్రీకాకుళం కోర్టులో హాజరుపర్చడానికి బుధవారం రాజమండ్రి నుంచి తీసుకొచ్చారు. ఈ క్రమంలో స్పెషల్ మొబైల్ కోర్టు ఇన్‌చార్జి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి భరణి వాదోపవాదనలు విన్నారు. అనంతరం నవంబర్ 5 వరకు అనిల్‌కుమార్‌కు రిమాండ్ విధించారు. ఎస్ఐ వాసుదేవరావు నేతృత్వంతో బుధవారం రాత్రి రాజమండ్రి జైలుకు తరలించారు.

నవంబర్ 3న చెస్ టోర్నమెంట్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం పీఎన్‌కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్ పాఠశాలలో నవంబర్ 3వ తేదీన స్కూల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 జరగనుంది. చెస్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆ పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ కోరారు. పోటీలకు హాజరయ్యే పాఠశాల స్థాయి విద్యార్థులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు భోజన సదుపాయంతోపాటు విజేతలకు మెడల్స్, ప్రసంశాపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. నవంబర్ 1వ తేదీలోగా 94918 02386 నంబర్‌కు కాల్‌చేసి వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శ్రీకాంత్ సూచించారు.

తక్షణమే సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి తదితరులు

జి.సిగడాం: మడ్డువలస సాగునీరు ఇంతవరకు మండలానికి రాకపోవడంతో రైతులు పండించే పంటలన్నీ పూర్తిగా ఎండిపోతున్నాయని, తక్షణమే సాగునీరు అందించాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, దవళపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు కోరారు. మండలంలోని దవళపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి మండలానికి మడ్డువలస కాలువ ద్వారా చుక్క నీరు రాలేదన్నారు. ఆనందపురం, దవళపేట, వాండ్రంగి, పెంట, నాగువలస, పాలఖండ్యాం, టీడీవలస, సంతవురిటి, అబోతులపేట, నిద్దాం, మెట్టవలస, గ్రామాల్లో ఉన్న సుమారుగా 5 వేల ఎకరాల వరి పంట పొట్టదశలో ఉందన్నారు. సాగునీరు అందకపోతే పండించిన వరి అంతా నాశనం అవుతుందన్నారు. రెండు రోజుల్లో ఈ గ్రామాలకు మడ్డువలస సాగునీరు ఇవ్వకపోతే రైతులంతా కలిసి కలెక్టర్ కార్యలయం వద్ద ధర్నాచేసి, నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు కంచరాన రమణరావు, పేడాడ నారాయణరావు, చింతాడ వెంకటరమణ, పేడాడ కృష్ణంరాజు, పేడాడ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థి శివసాయిని అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు రెండో ఏడాది చదువుతున్న ఆర్.శివ సాయికి డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కర్నూల్‌లో ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో రిలే రన్నింగ్ రేస్‌తో ద్వితీయ స్థానం సాధించి, జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనే అర్హత సాధించాడు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, డీఎస్‌డబ్ల్యూ గేదెల రవి, పీడీలు రాజు, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.





